క్లుప్తంగా

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజుపాలెం: మండలంలోని పెద నెమలిపురి రైతు సేవా కేంద్రంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ జీఎస్ ధనుంజయ్, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

స్త్రీల సమాజం అధ్యక్షురాలిగా ఎమ్మెల్యేమ్మ



సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి స్త్రీల సమాజం నూతన ప్రెసిడెంట్‌గా గుజ్జర్లపూడి ఎమ్మెల్యేమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మాచర్ల సువార్తమ్మ, సెక్రటరీగా కూచిపూడి సరళ, జాయింట్ సెక్రటరీగా గుజ్జర్లపూడి. మార్తమ్మ ఇశ్రాయేలు, ట్రెజరర్‌గా దర్శి మంజూష, వైస్ ట్రెజరర్‌గా కోట జయంతి, కార్యవర్గ సభ్యులుగా గుజ్జర్లపూడి లీలమ్మ, చౌటుపల్లి మాణిక్యం, గుజ్జర్లపూడి మార్తమ్మబాబు, కొయ్యలమూడి రోజి, గుజ్జర్లపూడి అన్నమ్మ, వేమవరపు మరియమ్మ, గుజ్జర్లపూడి శ్రీదేవి, వెంకాయమ్మ(వడ్డవల్లి), గుజ్జర్లపూడి ఎస్తేరురాణి, పరిచారకులుగా గుజ్జర్లపూడి విక్టోరియా రాణి, చిలుక సుగుణ ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని బాధ్యులు తెలిపారు. సంఘ క్షేమాభివృద్ధి, సువార్త పరిచర్య, ఆత్మల రక్షణ కొరకు దేవుని సేవలో భాగస్తులు కావాలని సంఘ కాపరి జె.ఇశ్రాయేలు నూతన కార్యవర్గాన్ని ఆశీర్వదించారు.

రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా అదివారం రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. పొలంలో విత్తనం వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేపట్టాలన్నారు. విత్తనం వేసిన 30 రోజుల పాటు దాని ప్రభావం మొక్కపై ఉంటుందని, ఎటువంటి చీడపీడలను మొక్కకు ఆశించకుండా కాపాడుతుందన్నారు. విత్తన శుద్ధితో పాటుగా జీవన ఎరువుల వాడకం, తయరీ విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు కె.అఖిల, ఆర్యహరి, జి.చైత్రిక, షేక్ అయిషా, టి.భువనేశ్వరి, టి.శ్వేత, కె.దివ్య పాల్గొన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి

ఏపీటీఎఫ్ డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను వెంటనే ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పల్నాడుజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెజ్జం సంపత్‌బాబు, పమ్మి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలనీ, 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ మినహాయింపుల రూపంలో దాదాపు రూ.2500కోట్లు ఖజానాకు చేరిందన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న ఆర్థిక అవసరాలను తీర్చేందుకు మంజూరు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులపై యాప్‌లు, అపార్ ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు సుబ్బరాజు చెరువు బహిరంగ వేలం

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుబ్బరాజు చెరువును సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బహిరంగ వేలంలో పాల్గొనే వారందరు దరావత్తు డిపాజిట్ నగదు రూ.1,38,750 చెల్లించి రశీదు పొంది వేలంలో పాల్గొనాలన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

రొంపిచర్ల: రైతునగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు డ్రైన్‌కు శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు బోయపాటి వాసు, శాకమూరి రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిత కోసం..!

- సత్ఫలితాలిస్తున్న భవిత కేంద్రాలు
- ప్రత్యేక శిక్షణతో ప్రత్యేకావసరాల పిల్లల్లో మార్పులు
- ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీతో పిల్లల్లో మార్పు



రాజుపాలెంలోని భవిత కేంద్రం

రాజుపాలెం: విభిన్న ప్రతిభావంతులను అక్కున చేర్చుకుంటున్నాయి భవిత కేంద్రాలు. వారికి ప్రత్యేకంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తూ విశేష కృషి చేస్తున్నాయి. మండల కేంద్రంలో సర్వశిక్ష అభియాన్ ద్వారా ఈ కేంద్రాలు దివ్యాంగులకు వరంగా మారాయి. వీటి పనితనంపై పిల్లల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 28 భవిత కేంద్రాలకు గాను 56 ఐఆర్‌టీ ఉపాధ్యాయులు, 28 మంది ఆయాలు పనిచేస్తున్నారు. మండలంలో 3 ఏళ్ల పైబడిన 18 ఏళ్ల లోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 218 మంది ఉండగా మండల భవిత కేంద్రంలో 22 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. మిగిలిన వారిలో కొంతమంది మంచానికి పరిమితమై ఉండగా, మరి కొంతమంది వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు.

భవిత అందించే సేవలు

స్థానికంగా భవిత కేంద్రం నడుస్తోంది. ఇందులో ఒకరు కేర్ టేకర్, ఇద్దరు ఐఆర్టీలు ఉంటారు. ఈ కేంద్రంలో స్పీచ్ థేరపీ, ఫిజియోథెరపీ, మానసిక ఎదుగుదల లేనివారికి శిక్షణ ఇస్తూ వారిని సాధారణ స్థితికి తీసుకొస్తారు. వారానికి రెండు సార్లు ఫిజియోథెరిపి చేస్తుంటారు. 21 రకాల వైకల్యాలు గల విద్యార్థులకు ఇక్కడ విద్యా బోధనతో పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.



ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు తరగతులు నిర్వహిస్తున్న ఐఆర్‌టీ

కేంద్రంలో సౌకర్యాలు

భవిత కేంద్రంలో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం అందజేస్తారు. ఐఆర్టీలు గ్రామాలలో అవగాహన కల్పించి, దివ్యాంగులు భవిత కేంద్రాలకు వచ్చే విధంగా కృషి చేస్తారు. కేంద్రానికి రాలేని దివ్యాంగ విద్యార్థులకు ఐఆర్‌టీ వారానికి ఒక్కరోజు వారి ఇంటికి వెళ్లి ఫిజియోథెరిపి అందించి, యోగక్షేమాలు తెలుసుకుంటారు. నెలకు ఒకసారి కేర్ టేకర్‌గా వచ్చే వారికి టీఏ రూపంలో రూ.300లు అందజేస్తారు. ఫిజియోథెరిపి రోజున కేర్‌టేకర్లకు మధ్యాహ్న భోజనం అందిస్తారు.



ఫిజియోథెరిపి నిర్వహిస్తున్న డాక్టర్ రాంబాబు

ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాడు



మా బాబుకు పుట్టుకతోనే లోపం ఉంది. భవిత కేంద్రంలో ఫిజియోథెరిపీ, స్పీచ్ థెరిపి అందించడం వల్ల ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాడు. స్పెషలిస్ట్ డాక్టర్లతో ఫిజియోథెరిపీ అందిస్తున్నారు.

– చిలకా బ్యివలా, చిన్నారి తల్లి

ఉద్యోగం తృప్తినిస్తోంది..



ఇతరులు పక్కన ఉంటే తప్ప నడవలేని స్థితిలో ఉన్న పిల్లలకు నడక నేర్పించడం, స్పీచ్ థెరఫీ ఇచ్చి మాటలు వచ్చేలా చేయడం సంతృప్తినిస్తోంది. ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నాం. ఎక్కువ మంది పిల్లల్లో మార్పు వస్తోంది.

– మార్తమ్మ, ఐఆర్‌టీ, రాజుపాలెం

గతుకులకు అతుకులేవి?



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన పోలీస్ పెట్రోల్ బంక్ ఎదుట రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉంది. కనీస మర్మతులు చేపట్టడం లేదు. దీంతో నిత్యం గతుకుల్లో ప్రయాణిస్తూ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతుకులకు కనీసం అతుకులైన వేసేలా పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం

బెల్లంకొండ: అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారదోలవచ్చని చండ్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా 15– 25 సంవత్సరాల మధ్య వయస్సు గల వారే ఎయిడ్స్ బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోందన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల లెక్కల ప్రకారం ప్రపంచంలో భారత దేశం 2వ స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానంలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ అరక్షిత శృంగారానికి దూరంగా ఉండాలని తెలిపారు. కలుషితమైన సూదులు, సిరంజీలను వాడరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, తెలియని వారికి ఎయిడ్స్ ప్రభావాన్ని తెలయజేయాలని ఆయన తెలిపారు. వ్యాధి భారిన పడిన వారిని దూరం చేయకుండా వారిని ప్రేమతో ఆధరించాలని, వారికి సహాయ పడాలని సూచించారు.

వేగ నిరోధకాలే..ప్రమాదాలు

- ఇష్టం వచ్చినట్లు, పద్ధతి లేకుండా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు
- ప్రధాన కూడళ్లు, ముఖ్య ప్రదేశాల్లో ప్రమాదకరం
- సత్తెనపల్లి రహదారుల్లో నిత్యం ప్రమాదాలు



సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామం నుంచి ముస్నంగి తిరుపతి రెడ్డి సోదరి మరియరాణి ద్విచక్ర వాహనంపై వస్తోంది. రెంటచింతల వెళ్లేందుకు మాచర్ల బస్సు ఆమె ఎక్కాల్సి ఉంది. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట ఉన్న స్పీడ్ బ్రేకర్ దాటే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. కింద పడిన మరియరాణి తీవ్రంగా గాయపడింది. గత నెల 13న ఈ ఘటన జరిగింది. అప్పుడే కాదు.. పట్టణంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

సత్తెనపల్లి: వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు వాహనదారులు, ప్రయాణికుల పాలిట పాలిట మృత్యు పాశాలుగా మారుతున్నాయి. నిర్దేశిత పరిమాణంలో వేయకపోవడం, వాటిపై తెలుపు రంగు పూయకపోవడం వంటి కారణాలతో దగ్గరకు వచ్చేవరకు అవి కనిపించక వాహనాలు అదుపుతప్పి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం పట్టణంలోని పలు రహదారుల్లో ఏదో ఒక ప్రదేశంలో జరుగుతూనే ఉన్నాయి. అనేకమంది క్షతగాత్రులు అవుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో పట్టణంలో ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలే ప్రమాదాలను కొనితెచ్చిపెడుతున్నాయి.



బైపాస్ రోడ్డులో రైస్ మిల్లు వద్ద పగిలిన వేగ నిరోధకం



పట్టణంలోని నవతా ట్రాన్స్‌పోర్ట్ ఎదుట ప్రమాణాలకు విరుద్ధంగా..

ఎత్తుగా వేయడంతోనే..

వేగ నిరోధకాలను పలు మార్గాల్లో వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశిత పరిమాణంలో ఏర్పాటు చేయాలి. అయితే ఆయా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎత్తుగా వేయడంతో వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ రకమైన వేగనిరోధకాలు సత్తెనపల్లి పట్టణంలో దాదాపు అన్ని వార్డుల్లోనూ ఉన్నాయి.

తెలుపు రంగు లేకపోవడమే కారణం

వేగ నిరోధకాలు వేసినప్పటి నుంచి తెల్ల రంగు వేయకపోవడంతో దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అటు మున్సిపల్ అధికారులు.. ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో ప్రమాణాలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వేగనిరోధకాలను తొలగించడంతోపాటు అత్యవసరమైన చోట వేగనిరోధకాలను వాహన చోదకులకు కనిపించేలా తెలుపు రంగు వేసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని బోయ కాలనీకి వెళ్లే దారిలో తెలుపు రంగులేని వేగ నిరోధకం

విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యారంగ పరిరక్షణ కోసం బాధ్యతగా పనిచేద్దామని వక్తలు తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా పల్నాడుజిల్లా మహాసభలు నిర్వహించారు. మహాసభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ, పల్నాడు ప్రాంతం ఆర్థిక, విద్య రంగాలలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. తొలుత స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా జాతీయ, యూటీఎఫ్ పతాకాలను ఆవిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి, యూటీఎఫ్ పత్రిక ఎడిటర్ కుమార్‌రాజా, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు పాల్గొన్నారు.



ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

నరసరావుపేట: రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు అధికారంలో వచ్చిన ఆర్నెల్లులోనే చార్జీలు పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటమంటే ప్రజలను మోసం చేయటమే అవుతుందన్నారు.. 2023–24ఏడాదికి సంబంధించి రూ.7,912కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జిల భారం ప్రజలపై పడనున్నాయన్నారు. ఒక్కో యూనిట్ 92పైసలు చొప్పున 2026 వరకు వసూలు చేయనున్నారన్నారు. సీఎం తన ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు పెంచబోమని అవసరమైతే తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు గెలిచాక సామాన్య ప్రజల నడ్డి విరిచే విధంగా విద్యుత్ చార్జీలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. ఆ మాటలు నమ్మి ఓట్లేసి ప్రజలు మోసపోయామని భావిస్తున్నారన్నారు. చంద్రబాబు తీరు గెలిచేదాకా ఓడ మల్లయ్య గెలిచాక బోడి మల్లయ్య అనే విధంగా ఉందన్నారు.

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

విద్యాభారతి రాష్ట్ర కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి



మాట్లాడుతున్న విద్యాభారతి రాష్ట్ర కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి

సత్తెనపల్లి: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిపించాలని విద్యాభారతి రాష్ట్ర కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి అన్నారు. ఏపీ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖరావం బహిరంగ సభను దృష్టిలో పెట్టుకొని జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సమావేశానికి హైందవ శంఖారావం సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ నేరెళ్ల శంకర్రావు అధ్యక్షత వహించారు. జేపీఎస్ శాస్త్రీ మాట్లాడుతూ దేవాలయాలను హిందూ సంస్థలకు, సంఘాలకు అప్పగించాలని కోరుతూ విజయవాడ సమీపంలో జరిగే భారీ బహిరంగ సభలో అధిక సంఖ్యలో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి హిందువులు తరలిరావాలని పిలుపునిచ్చారు. విశ్వ హిందూ పరిషత్ స్థానిక బాధ్యుడు శివాచారి మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ అధీనం నుంచి విముక్తి చేసి, హిందూ సంస్థలకు అప్పగించాలన్నారు. దేవాలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించి, దేవాలయ వ్యవస్థ పవిత్రతను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానవక్తగా విచ్చేసిన కలగ శ్రీనివాస రావు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, హిందూ జీవన విధానంలో దేవాలయాల ప్రాధా న్యతను వివరిస్తూ దేవాలయాలు గతంలో సేవా, సంస్కార, కేంద్రాలుగా ఉండేవన్నారు. ఎంతోమంది పెద్దలు వేల ఎకరాల భూమిని మాన్యాలుగా దేవాలయాలకు సమర్పించారని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ బాధ్యులు చలువాది సత్యనారాయణ, చలపాటి సురేష్, నరహరిరెడ్డి, ప్రభుదాసు, వెంకటాద్రి, తదితరులతో పాటు, వివిధ హిందూ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, మాతృ మూర్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల



ఆలయంలో భక్తుల సందడి



అమ్మవారికి పొంగళ్లు చేస్తున్న భక్తులు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతికి సమీపాన ముత్తాయిపాలెంలో వెలసిన శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జన్మదిన పూజా వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రికే భక్తులు అధిక సంఖ్యలో ముత్తాయిపాలెం చేరుకున్నారు. ఉదయం 6 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ అనంతరం బలిహరణ చేపట్టారు. గణపతిహోమం, గ్రామదేవతల ఆహ్వానం కార్యక్రమంలో ఊరి బయట ఉన్న గ్రామ దేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరాశరం రామకృష్ణమాచార్యులు సుదర్శన హోమ, అమ్మవారికి ఏకనామ కుంకుమార్చన చేశారు. పలురకాల పుష్పమాలలతో కన్నుల పండువగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పొంగించారు. అన్నదానం చేశారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి చరిత్ర నాటకం భక్తులకు ఆధ్యాత్మిక భావనలను పెంపొందించింది. సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



విశేషాలంకారంలో అమ్మవారు

కనుల పండువగా తెప్పోత్సవం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, గంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవాలు ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. రెండు ఆలయాల్లోని కోనేరులలో స్వామివార్లను హంస వాహనంపై విహరించారు. భక్తులు శివ నామస్మరణలో మైమరిచిపోయారు. ఆయా ఆలయాల అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ, పమిడిమర్రు శ్రీనివాసరావు విశేషపూజలు జరిపించారు. స్వామివారికి అన్నాభిషేకం, లక్షబిలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులు వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ కోనేటిలో వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించి, హంస వాహనంపై కొలువుదీర్చారు. కోనేటిలో స్వామివార్లు విహరిస్తుండగా తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ఆలయాల కమిటీ నిర్వాహకులు పండితులను ఘనంగా సన్మానించారు. అనంతరం చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మహిళా భక్తులు అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్నారు. స్వామివారి విశేష అలంకరణ, విశ్వరూపదర్శనంలో తిలకించిన భక్తులు మొక్కులు చెల్లించారు. ఎస్ఐ చల్లా సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి

శౌరివారి ఉత్సవాలు ప్రారంభం

బొల్లాపల్లి: మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి పండుగ ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే పండుగ ఉత్సవాల్లో తొలి రోజు ఉదయం 9గంటలకు రెవ.ఫాదర్ ఎం.అనిల్‌కుమార్ ప్రార్ధనలు చేశారు. దివ్య పూజా బలి కార్యక్రమంలో రెవ.ఫాదర్ వై. జాకబ్‌రెడ్డి, సహాయ విచారణ గురువులు పి.బాలచంద్ హాజరై పూజా బలి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం ...

రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సుమారు 15 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు 3వ తేదీన ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.